సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



59.562 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 59.562 టీఎంసీలు ఉన్నాయి. ఫైతట్టు నుంచి 16,083 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 50, ఉత్తర కాలువకు 40, కండలేరుకు 10 వేలు, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.80,130
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,280
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,498
నవర (8 గ్రాములు)	రూ.59,984

గరిష్టం/కనిష్టం 33.5 /25.5

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆదివారం గాలిలో తేమ 77 శాతం ఉంది.

న్యూస్‌రీల్

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు చివరి అవకాశం నేడు

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్షలో బోధనా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ సోమవారం సమగ్రశిక్ష కార్యాలయంలో జరుగు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమానికి హాజరుకావాలని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే హాజరుకాని అభ్యర్థులు ఫోన్లకు మెసేజ్ పెట్టినట్లు చెప్పారు. తర్వాత సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు అవకాశం ఉండదన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కష్టాలు

కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కష్టాలు తప్పడం లేదు. మూడు రోజులుగా స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతోంది. ఇందు కోసం జిల్లా నుంచి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులకు కనీస వసతులైన తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంలో అవస్థలు పడ్డారు. కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో కొందరు మెట్లపై, మరి కొందరు పిట్టగోడపై, మరి కొందరు నిలబడి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఎదురు చూశారు. చివరి రోజు కావడంతో కార్యాలయంలో ఎక్కువ మంది అధికారులను వెరిఫికేషన్‌కు నియమించకపోవడంతో గంటల తరబడి ఎప్పుడు పిలుస్తారా అని వేచి చూశారు. వెరిఫికేషన్ సమయంలో టోకెన్ ఇచ్చి వరుస క్రమంలో పిలిచే ఉంటే ఇన్ని ఇబ్బందులు పడే వాళ్లం కాదని పలువురు చెబుతున్నారు. ఈ విషయంపై సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి దృష్టికి తీసుకెళ్లగా ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో అభ్యర్థులు వచ్చారన్నారు. జిల్లా వ్యాప్తంగా 31 బోధనా పోస్టులకు 498 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరందరి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తున్నామన్నారు.

31 వరకు ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ పీవీజే రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఫైన్ లేకుండా 25వ తేదీ వరకు, రూ.200 ఫైన్‌తో 29వ తేదీ వరకు, రూ.500 ఫైన్‌తో 31వ తేదీ వరకు ప్రవేశాలను చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఏపీ ఆన్‌లైన్, వార్డు సచివాలయం ద్వారా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 90006 19699 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

డెంగీతో బద్దిపూడి సర్పంచ్ మృతి



అనిల్ రెడ్డి (ఫైల్)

ఉలవపాడు: డెంగీతో బద్దిపూడి గ్రామ సర్పంచ్ కూనం అనిల్‌రెడ్డి (48) ఆదివారం మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడిగా మంచి మెజారిటీతో గెలుపొంది సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల డెంగీ బారిన పడడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. ఆయనకు భార్య ఉంది. అనిల్‌రెడ్డి మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని మండల కన్వీనర్ పోతురాజు, జేసీఎస్ కన్వీనర్ ధనకోటేశ్వరరావు, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు రామాలశింగారెడ్డి, వైస్ ఎంపీపీ సయ్యద్ ఫజుల్, మండల కో ఆప్షన్ సభ్యులు ఖాదర్‌బాషా, మాజీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ నేతలు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలియజేశారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి



దుకాణం సమీపంలో గుమికూడిన స్థానిక మహిళలు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని మైపాడుగేటు శ్రీనివాసనగర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలంటూ స్థానిక మహిళలు ఆదివారం రాత్రి దుకాణం ఎదుట ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడంతో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, పరిస్థితి దారుణంగా ఉందన్నారు. షాపును వెంటనే తొలగించాలని ఎక్సైజ్ అధికారులను ఇప్పటికే కోరామన్నారు. వారు స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే దుకాణం వద్ద కూల్ డ్రింక్ షాపు తమకే కావాలని లేని పక్షంలో వ్యాపారం ఎలా చేస్తావో అంటూ అధికార పార్టీ నేత వ్యాపారులను బెదిరించారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ప్రమోషన్లకు కలెక్షన్లు

వైద్యశాఖలో అవినీతి జాబితా

- ఏఎన్ఎంల పదోన్నతుల్లో సీనియారిటీకి తిలోదకాలు
- ముందు వరుసలోకి జూనియర్లు
- ఆందోళన చేస్తున్న ఏఎన్ఎంలు
- తొలుత 813 మందితో లిస్ట్.. ఆ తర్వాత 280 మందికే అంటూ మెలిక
- ఇందులో 51 మందికి అక్రమంగా సీనియారిటీ
- అధికార పార్టీ నాయకుల ఒత్తిడి.. భారీ స్థాయిలో చేతులు మారిన నగదు

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో అక్రమ ప్రమోషన్ల జాబితా దుమారం రేపుతోంది. అధికారమే అండగా టీడీపీ నేతలు ప్రభుత్వ శాఖలను శాసిస్తున్నారు. ఏఎన్ఎంల పదోన్నతులను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. కష్టపడి చదువుకుని, పోటీ పరీక్షల్లో ప్రావీణ్యం చూపించి ఉద్యోగాలు పొందిన ఏఎన్ఎంల ప్రమోషన్లను తమ గుప్పెట్లోకి తీసుకుంటున్నారు. టీడీపీ నేతల అవినీతికి వైద్యారోగ్యశాఖ అధికారులు అండగా నిలుస్తున్నారు. జిల్లాలో ఏఎన్ఎంల పదోన్నతుల నేపథ్యంలో అర్హులతో ప్రొవిజనల్ మెరిట్ జాబితాను ఇటీవల వైద్యాధికారులు ప్రకటించారు. తాజాగా ఆ జాబితాను పక్కన పెట్టేసి అనర్హులతో కూడిన జాబితాను సిద్ధం చేస్తున్నారు. సీనియర్లను వెనక్కి నెట్టేసి.. జూనియర్లను ముందుకు తీసుకువస్తున్నారు. ప్రమోషన్లలో అన్యాయం జరిగితే ఏఎన్ఎంలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడానికి సిద్ధమవుతున్నారు.





ప్రమోషన్లలో లోపాలు సరిదిద్దాలని కోరుతూ డీఎంహెచ్‌ఓకి వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఏఎన్ఎం అసోసియేషన్ నాయకులు (ఫైల్)

నెల్లూరు (అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో అధికారులు నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారు. ముడుపులు తీసుకుని టీడీపీ నేతలు అందజేస్తున్న జాబితాకు ఆమోద ముద్ర వేస్తున్నారు. ఇటీవల ఒక టీడీపీ నేత కోసం ఎలాంటి అవినీతి లేని ఆశా కార్యకర్తను ఉన్న పళంగా ఉద్యోగం నుంచి తీసేసి రోడ్డున పడేశారు. డిప్యుటేషన్లలోనూ అదే పరిస్థితి. తాజాగా ప్రభుత్వం సచివాలయాల్లో పనిచేసే గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ప్రమోషన్లు కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇదే అదనుగా భావించిన అధికార పార్టీ నాయకులు ప్రమోషన్లు కల్పించడంలో తాము చెప్పినట్లు చేయాలని హుకుం జారీ చేశారు. దీంతో అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి సీనియర్లకు అన్యాయం చేస్తూ జూనియర్లకు పదోన్నతులు కల్పించేందుకు జాబితాను తయారు చేసి విడుదల చేశారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున నగదు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాల ప్రమోషన్లను వ్యతిరేకిస్తూ తమకు న్యాయం చేయాలంటూ సీనియర్లు ఆందోళన బాటపట్టారు.

వైఎస్సార్‌సీపీ మేలు చేస్తే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించింది. ఆ ప్రభుత్వంలో రూపాయి ఖర్చు లేకుండా కేవలం మెరిట్‌తోనే ఉద్యోగాలు సాధించుకున్నారు. అయితే కూటమి నేతలు వారి పదోన్నతులను క్యాష్ చేసుకునే పనిలో ఉన్నారు. ప్రజలకు మంచి వైద్యం అందించాలనే ధ్యేయంతో కాంట్రాక్ట్ పద్ధతిలో రెండో ఏఎన్ఎంలను నియమించారు. అప్పటికే వారు పదేళ్లు సేవలందించారు. 2019లో అధికారంలోకి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసేందుకు పూనుకున్నారు. సచివాలయానికి అనుబంధంగా రెగ్యులర్ నర్సులను నియమించేందుకు డీఎస్సీ పరీక్ష రాయాలని చెప్పారు. వారు అప్పటి వరకు చేసిన సర్వీసుకు 15 మార్కులు అదనంగా కేటాయించారు. దీంతో 2వ ఏఎన్ఎంలుగా చేస్తున్న వారందరూ సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్ఎంలుగా నియమితులయ్యారు. రెండేళ్ల ప్రొబేషన్ పీరియడ్ అనంతరం రెగ్యులర్ అయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల రెగ్యులర్ అవడమే కాకుండా మంచి జీతాలు పొందుతున్నారు.

ఎంపీహెచ్ఏలుగా పదోన్నతికి ఆదేశాలు

సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్ఎంలుగా 850 మంది వరకు పని చేస్తున్నారు. అందరూ ప్రమోషన్‌కు అర్హులే. అయితే వీరిలో సీనియారిటీ, ర్యాంకును బట్టి ప్రభుత్వ నిబంధనల ప్రకారం 813 మందితో జాబితాను ప్రకటించింది. ఆ తర్వాత 280 మందికి ప్రమోషన్లు ఇచ్చేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాచరణ చేపట్టింది. అందులో భాగంగా ఈ నెల 16న వైద్య ఆరోగ్యశాఖ ప్రొవిజనల్ మెరిట్ జాబితాను తయారు చేసి ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఉంచింది. ప్రమోషన్లకు సంబంధించి అభ్యంతరాలుంటే రెండు రోజుల్లో తెలపాలని ఏఎన్ఎంలకు సూచించారు.

అడిగితే అడ్డదిడ్డ సమాధానాలు

ప్రమోషన్ల జాబితాను పరిశీలించి నష్టపోతున్న ఏఎన్ఎంలు డీఎంహెచ్‌ఓ పెంచలయ్యను కలిశారు. జాబితాలో తప్పులు ఉన్నాయని సరిచేయమని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన బదులిస్తూ ఇది తాము తయారు చేసిన జాబితా కాదని, గతంలో డీఎస్సీ పరీక్ష నిర్వహించిన జెడ్పీ సీఈఓ తయారు చేసి తమకు పంపిన జాబితా అని తెలిపారు. ఆ ప్రకారం ప్రస్తుతం ప్రమోషన్లు ఇస్తున్నామని తెలిపారు. అలా పంపి ఉంటే ఆ ఆర్డర్ కాపీ ఇవ్వమని నర్సులు అడిగితే వైద్యశాఖ నుంచి ఎలాంటి సమాధానం లేదు.

- వాస్తవంగా జెడ్పీ సీఈఓ తయారు చేసిన జాబితా ప్రకారం ప్రకటించి ఉంటే తమకు రెండు ఏళ్ల ప్రొబేషనరీ పీరియడ్ డిక్లేర్ చేసేటప్పుడు కరెక్ట్‌గా ఉన్న జాబితా ఇప్పుడు ఎలా మారిందంటే సమాధానం లేదు.
- గత ఐదేళ్లుగా ఈ విషయాన్ని తమకు ఎందుకు చెప్పలేదని అడిగినా మౌనమే సమాధానం అయింది.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమకు ప్రమోషన్లు ఇచ్చేందుకు జాబితాను సిద్ధం చేశారు. ఆ జాబితాలో తమ పేర్లు సక్రమంగా ఉన్నాయి. అయితే అంతలోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చి ప్రమోషన్లు ఆగాయి. అప్పుడు సక్రమంగా ఉన్న జాబితా ఇప్పుడు ఎందుకు మారిందంటే సమాధానమే లేదు.
- గతంలో ఆరుగురికి ఇన్ సర్వీసులో మార్కులు కలపలేదు. అవి ఇప్పుడు కలిశాయి అని డీఎంహెచ్‌ఓ చెప్పారు. ఆ ఆరు మంది పేర్లు ఇవ్వమంటే డీఎంహెచ్‌ఓ ఇవ్వడం లేదు
- స్పోర్ట్స్ కోటాలో ఇతర జిల్లాల వారు వచ్చినందు వల్ల వారి పేర్లు ప్రమోషన్ల జాబితాలో ముందుకు వచ్చాయని డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఆవివరాలు ఇవ్వమన్నా ఇవ్వడం లేదు.

అక్రమాల పుట్ట.. ప్రమోషన్ల జాబితా

ప్రమోషన్ల జాబితాను చూసిన ఏఎన్ఎంలు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఆ జాబితాలో అనేక లోపాలు వెలుగు చూశాయి. ఆజాబితాను 15వ తేదీన ప్రకటిస్తామని చెప్పి 16న ప్రకటించారు. అందులో ప్రధానంగా అపాయింట్‌మెంట్ తీసుకున్న తేదీ ప్రకారం సీనియారిటీ చూపలేదు. ఉద్యోగంలో నర్సులు చేరిన ర్యాంకు ప్రకారం ఇప్పుడు జాబితా లేదు. మూడు, నాలుగు నెలల తర్వాత ఉద్యోగంలో చేరిన వారి పేర్లు ప్రమోషన్ల జాబితాలో ముందుకు వచ్చారు. ఇప్పటికే ఇలా అర్హతలేని 51 మంది ఏఎన్ఎంలను సీనియార్టీ జాబితాలో ముందు వరుసలో చూపినట్లు సమాచారం.

అధికారపార్టీ ఒత్తిళ్లతోనే..

అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో అనేక మందికి అర్హత లేకపోయినా ప్రమోషన్ల జాబితాలో ముందుకు తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. సీనియారిటీ లేకపోయినప్పటికీ ప్రమోషన్లు ఇప్పి స్తామని చెప్పి పలువురు ఏఎన్ఎంల వద్ద తెలుగు తమ్ముళ్లు భారీగా నగదు వసూలు చేశారనే ప్రచారం జోరందుకుంది. ఈ వ్యవహారంలో అధికారులకు సైతం మామూళ్లు అందాయంటూ వార్తలు గుప్పుమంటున్నాయి. లోపాలు సరిదిద్దాలంటూ సచివాలయ ఏఎన్ఎం అసోసియేషన్ నాయకులు, హంస అసోసియేషన్ల నాయకులు ఇప్పటికే డీఎంహెచ్‌ఓకు వినతిపత్రాలు ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి అర్హత ఉన్న వారికి న్యాయం చేయాలని ఏఎన్ఎంలు కోరుతున్నారు.

మాకు న్యాయం చేయాలి



ప్రస్తుతం ప్రకటించిన ఏఎన్ఎంల ప్రమోషన్లకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాలో అనేక లోపాలున్నాయి. వాటిని సవరించాలి. మేము 500 మంది పేర్లను పరిశీలించగా అర్హత లేని 51 మంది పేర్లు ముందు వరుసలో ఉన్నట్టు గుర్తించాం. ఈ వివరాలను డీఎంహెచ్‌ఓకు అందజేశాం. లోపాలు సరిదిద్ది తమకు న్యాయం చేయాలి. లేకపోతే ఉద్యమించాల్సిన పరిస్థితి ఉంటుంది.

– ఈదూరి స్నేహలత, వార్డు సచివాలయం హెల్త్ సెక్రటరీ, గ్రేడ్-3 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు

అభ్యంతరాలు స్వీకరిస్తున్నాం.. ఎవరికీ అన్యాయం జరగదు



సచివాలయ గ్రేడ్-3 ఏఎన్ఎంల ప్రమోషన్లకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితా ప్రకటించి అభ్యంతరాలను స్వీకరించాం. ఫైనల్ జాబితాను ఇంకా తయారు చేయలేదు. ఎవరికి అన్యాయం జరగనిచ్చే ప్రసక్తే లేదు. ఇందులో ఎవరి ఒత్తిళ్లు లేవు. ఏఎన్ఎంల అభ్యంతరాలు పరిగణనలోనికి తీసుకుని నిబంధనల ప్రకారం మాత్రమే ప్రమోషన్లు ఇస్తాం.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ

కరువు రక్కసి.. సెస్ పిండేసి..

ఈ ఏడాది రూ.34 కోట్ల టార్గెట్

- అన్ సీజన్‌లోనే రూ.11 కోట్లు వసూలు
- మార్కెట్ కమిటీ సెస్ వసూళ్లలో కొంత పంథా
- కళాశాలల హాస్టల్స్, స్వీట్ షాపుల్లో సోదాలు

కూటమి ప్రభుత్వం సంపద సృష్టిలో భాగంగా రైతాంగాన్ని టార్గెట్ చేసింది. ఓ పక్క కరువు రక్కసి వెంటాడుతుంటే.. మరో పక్క మార్కెట్ కమిటీ సెస్ వసూళ్లకు టార్గెట్ పెట్టింది. ముక్కుపిండి వసూళ్లు చేస్తోంది. పొలాల వద్దనే తిష్టవేసి సెస్ వసూళ్లు చేయాలని అధికారులు సిబ్బందిపై ఒత్తిడి తెస్తుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ ఉత్పత్తులు ఎవరి దగ్గర కొన్నారో చెప్పాలంటూ కళాశాల హాస్టల్స్, పీజీలు, స్వీట్‌షాపుల్లో తనిఖీ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు.

నెల్లూరు (సెంట్రల్): జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి కరువు రక్కసి రైతులను వెంటాడుతోంది. ఖరీఫ్ సీజన్‌లో ఏటా 3 నుంచి 4 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. అయితే ఈ ఏడాది జలవనరుల్లో నీటి నిల్వలు లేకపోవడంతో కనీసం 50 వేల ఎకరాల్లో కూడా వరి సాగు జరగలేదు. దీనికి తోడు దిగుబడులు కూడా భారీగా పడిపోయింది. ఈ పరిస్థితుల్లో ఇలాంటి సాకులు చెప్పొద్దని, మార్కెట్‌శాఖకు కట్టాల్సిన సెస్ మాత్రం రైతుల పొలాల వద్దకు వెళ్లి తిష్ట వేసి సెస్ వసూలు చేయాలని అధికారులు ఒత్తిళ్లు తేవడంతో సిబ్బంది గొల్లుగొల్లుమంటున్నారు.

ఆరు నెలల్లో రూ.11 కోట్ల వసూలు

జిల్లాలో నెల్లూరు, కోవూరు, కావలి, కందుకూరు, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి, సర్వేపల్లిల్లో ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఆయా కమిటీల పరిధిలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను వివిధ ప్రాంతాలకు సరఫరా చేసేందుకు మార్కెట్ శాఖకు సెస్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది మార్కెట్‌శాఖ టార్గెట్ రూ.34.43 కోట్లు వసూలు చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కరువు పరిస్థితి ఉందని, అటు రైతులు పంటలు పండించలేక, ఇటు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా అధికారులు ఉన్నతాధికారులకు చెప్పినా.. ససేమిరా అంటూ వసూళ్లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఆరు నెలలుగా కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ అధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేక అనేక విధాలుగా దాదాపు రూ.11.69 కోట్లను సెస్ రూపంలో వసూలు చేయడం గమనార్హం.



ఆ కమిటీల్లోనే వసూళ్లు ఎక్కువ

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో నెల్లూరు రూ.2 కోట్ల 98 లక్షల 80 వేలు, కోవూరు రూ.3 కోట్ల 41 లక్షల 44 వేలు, కావలి రూ.2 కోట్ల 9 లక్షల 70 వేలు అత్యధికంగా వసూలు చేశారు. కందుకూరులో రూ.92.51 లక్షలు, రాపూరు రూ.34.93 లక్షలు, ఆత్మకూరు రూ.81.81 లక్షలు, ఉదయగిరి రూ.43.76 లక్షలు, సర్వేపల్లి రూ.66.89 లక్షల చొప్పున సెస్ ఫీజు ఇప్పటి వరకూ వసూలు చేశారు.

వ్యాపారులు, హాస్టళ్లపై దాడులు

సాధారణంగా వ్యవసాయ ఉత్పత్తులు తరలించే వారి వద్ద నుంచి ఆయా ఉత్పత్తులను బట్టి సెస్ వసూలు చేయాల్సి ఉంటుంది. కాని ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ఏ విధంగా అయినా ఆదాయం రాబట్టాలనే ఆలోచనతో వసూళ్లకు కొత్త పంథా ఎంచుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు చదివే హాస్టల్స్, బేకరీలు, స్వీట్ షాపుల్లో మార్కెట్ శాఖ తనిఖీలు చేయాలని ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్స్‌లో వాడే బియ్యం ఎక్కడి నుంచి తెచ్చారు. బిల్లు ఉందా? ఏ మిల్లు నుంచి తెచ్చారు? లేదా ఏ రైతు నుంచి కొనుగోలు చేశారనే వివరాలను రాబడుతున్నారు. హాస్టల్స్ నిర్వాహకులు నేరుగా రైతుల నుంచి తీసుకుని కొనుగోలు చేస్తే దానికి సెస్ కట్టారా? ఆ రైతు వివరాలు ఇవ్వండి అంటూ బెంబేలెత్తిస్తున్నారు. దీంతో పాటు స్వీట్ షాపు, బేకరీలో తనిఖీలు చేస్తూ మీరు వాడుతున్న స్వీట్స్‌కు జీడిపప్పు, బాదంపప్పు, ఇతర పప్పు దినుసులు ఎక్కడి నుంచి కొన్నారు. కొనుగోలు చేసిన వారి వివరాలు ఇవ్వాలని, నేరుగా కొంటే సెస్ కట్టారా లేదా వివరాలతో వ్యాపారులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా తనిఖీలు చేయడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేస్తున్నాం

ప్రస్తుతం మేము అన్ని చోట్ల తనిఖీలు చేస్తున్నాం. హాస్టల్స్, స్వీట్ షాపు, బేకరీల్లో తనిఖీలు చేసి, ఎక్కడి బియ్యం, ఇతర పప్పుదినుసులు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలుసుకుంటున్నాం. ఉన్నతాధికారులు ఆదేశాల ప్రకారం ఏదైనా చేస్తాం. సెస్ తప్పకుండా చెల్లించాల్సి ఉంటుంది.

– అనితాకుమారి, ఏడీ, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ

వీఓఏల అక్రమ తొలగింపుపై కోర్టును ఆశ్రయిస్తాం

బిట్రగుంట: బోగోలు మండలంలో వీఓఏలుగా విధులు నిర్వహిస్తున్న నిరు పేద మహిళలను రాజకీయ ఒత్తిడితో రాజీనామాలు చేయాలని బెదిరించడం సరికాదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసమాఖ్య సంఘాల తీర్మానం మేరకు వీఓఏలుగా ఎన్నికై విధులు నిర్వహిస్తున్న మహిళలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇబ్బందులు పెడుతుందని మండిపడ్డారు. బలవంతంగా రాజీనామాలు చేయించే దిశగా ఇబ్బందులకు గురి చేయడంపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే పలుచోట్ల వీఓఏలు న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమకు అనుకూలంగా ఉత్తర్వులు పొందిన విషయాన్ని గుర్తుచేశారు. న్యాయస్థానాల ఆదేశాలు స్పష్టంగా ఉన్నా అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గితే తర్వాత ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధి హామీ క్షేత్ర సహాయకులను తొలగించి తమ కార్యకర్తలను ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా నియమించిందన్నారు. అదే తరహాలో వీఓఏలను కూడా రాజీనామాలు చేయాలని బెదిరింపులకు దిగడం దారుణమన్నారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి వారోత్సవాలు : ఎస్పీ


జి.కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా వారోత్సవాలను సోమవారం నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను మననం చేసుకోవడంతోపాటుగా సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలియజేశారు. 31 వరకు పోలీసుల ధైర్యసాహసాల చిత్రాలను సినిమా థియేటర్లు, కేబుల్ టీవీల్లో ప్రదర్శన, 26, 27 తేదీల్లో జిల్లా కేంద్రంతోపాటు అన్ని సబ్ డివిజన్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లలో ఓపెన్ హౌస్‌లు, చర్చావేదిక, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 28న ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాలులో మెగా వైద్య, రక్తదాన శిబిరం, 31న సమైక్యతా పరుగుతో వారోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

అదుపుతప్పిన మోటార్‌బైక్

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన రవికుమార్ పని నిమిత్తం బైక్‌పై గొలగమూడికి వస్తుండగా గేదెలు అడ్డు వచ్చాయి. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. రవికుమార్‌కు గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి


సురేష్ మృతదేహం


దుత్తలూరు: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలోని బండకిందపల్లి కంకర క్రషర్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లా బద్వేల్ మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన పి.సురేష్ (27) కొన్ని రోజులుగా కంకర క్రషర్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. టిప్పర్లో ఉన్న టైర్లను దించేందుకు నేలపై ఒక కాలు ఉంచి మరో కాలు టైరు మీద పెట్టి లిఫ్ట్‌ను పైకి లేపాడు. దీంతో పైనున్న విద్యుత్ తీగలు టిప్పర్‌కు తగిలాయి. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అయ్యి షాక్‌తో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. క్రషర్‌లో పనిచేస్తున్న తోటి వర్కర్లు గమనించి సురేష్‌ను చికిత్స నిమిత్తం వింజమూరులోని వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఉదయగిరి ఎస్సై శ్రీనివాసులు, సిబ్బంది వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	140
లేయర్ (లైవ్) :	115
బ్రాయిలర్ చికెన్ :	250
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	276
లేయర్ చికెన్ :	195

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.75
సన్నవి :	రూ.55
పండ్లు :	రూ.30

మరో సీజన్‌కు రెడీ

- పొగాకు నారుకు భలే గిరాకీ
- నారుమడులను ముమ్మరంగా కడుతున్న రైతులు
- స్థానికంగానే లభ్యత
- అధిక దిగుబడులనిచ్చే వంగడాల సాగుకు శ్రీకారం
- ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం


వర్షాలు బాగా కురిశాయి. దీంతో పొగాకు రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. కలిగిరి, డీసీపల్లి పొగాకు వేలం కేంద్రాల పరిధిలో ముమ్మరంగా నారుమడులను సాగు చేస్తున్నారు. తాము వేసుకోగా మిగిలిన నారును అమ్ముకుని లాభాలు ఆర్జిస్తున్నారు. కొందరు నారు అమ్మడానికే అధికంగా సాగుకు శ్రీకారం చుట్టారు. రెండేళ్ల నుంచి పొగాకుకు మంచి ధరలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది నారుకు కూడా డిమాండ్ పెరిగింది. పొలాలు, బ్యారన్ల కౌలు ధరలు కూడా బాగా పెరిగాయి.

కలిగిరి: 2024 – 25 సంవత్సరానికి పొగాకు సీజన్ ప్రారంభమైంది. ఈ ఏడాది పంట ఉత్పత్తికి సంబంధించిన కోటాను బోర్డు ఖరారు చేసింది. సీటీఆర్ఐ, ఐటీసీ, పొగాకు బోర్డు అధికారుల సూచనలతో రైతులు నారుమడులను సాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే బోర్డు ద్వారా ఎఫ్‌సీఆర్ – 15 రకం విత్తనాలను అందజేశారు. ఈ వంగడాలు ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలోని కలిగిరి, మర్రిపాడు మండలంలోని డీసీపల్లి వేలం కేంద్రాల పరిధిలో నారుమడుల సాగు చేపట్టి 30 నుంచి 40 రోజులైంది. 50 రోజులకు ఇది నాటేందుకు అనుకులంగా తయారవుతుంది. ఒక ఎకరంలో నారు బాగా పెరిగితే సుమారు 200 నుంచి 300 ఎకరాల్లో నాటుకోవచ్చు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందిస్తున్నారు. అధికారికంగా కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 120 ఎకరాల్లో, డీసీపల్లి కేంద్రం పరిధిలో 100 ఎకరాల్లో నారు సాగు చేశారు. ఒకప్పుడు నారు కోసం రాజమండ్రి, ఒంగోలు, కందుకూరు ప్రాంతాలకు వెళ్లేవారు. నేడు స్థానికంగా లభ్యమవుతుండడం రైతులకు కలిసొచ్చే అంశం.

రూ.2,000 నుంచి రూ.2,500

గత రెండేళ్లుగా పొగాకు మార్కెట్ బాగుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నారుకు కూడా మంచి ధరలు లభిస్తున్నాయి. ప్రారంభంలోనే ఐదు వేల మొక్కలున్న నారుమూట రూ.2,000 నుంచి రూ.2,500 వరకు ధర పలుకుతోంది. నాట్లు ముమ్మరంగా ప్రారంభమైతే నారుకు మరింత ధరలు వచ్చే అవకాశముంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది నారుకు మంచి ధరలు లభిస్తాయని నారు సాగు చేస్తున్న రైతులు ఆశాభావంతో ఉన్నారు.


పొగాకు నారుమడులు




నాటేందుకు సిద్ధంగా ఉన్న పొగాకు నారు

ఈ జాగ్రత్తలు తీసుకుంటే..

- పొగాకు నారుమడి బెడ్డును 10 మీటర్ల పొడవు, 1.2 మీటర్ల వెడల్పుతో నీరు నిల్వ ఉండకుండా కొంచెం ఏటవాలుగా ఏర్పాటు చేసుకోవాలి.
- నారుమడుల్లో కాలువలు ఏర్పాటు చేసి వృథా నీటిని బయటకు పంపాలి.
- ఒక్కో బెడ్డుకు 3.5 గ్రాముల విత్తనాలు వాడాలి. విత్తనాల మోతాదు ఎక్కువైతే నారు చిక్కగా మొలిచి భూమిలో ఉండే తేమతో మాగుడు తెగులు బారిన పడే ప్రమాదం ఉంది.
- భారీ వర్షాలకు, ఎండలకు దెబ్బతినకుండా మొక్క కట్టే వరకు నారుమడులను వరిగడ్డితో కప్పి ఉంచాలి.
- నీటిని అందించే సమయంలో పైపుల్లో ఉన్న వేడి నీరు మొక్కలపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలి.
- నారు సాగు చేసే పొలం చుట్టూ బంతి, ఆముదం మొక్కలను నాటితే పచ్చ, లద్దె పురుగులను నివారించవచ్చు.
- నారుమడుల్లో పక్షి స్థావరాలను ఏర్పాటు చేస్తే కొంతమేర పురుగుల బాధ తగ్గుతుంది.

గతేడాది నుంచి గిరాకీ



పదేళ్లుగా పొగాకు నారు పెంచుతున్నా. గతేడాది నుంచి గిరాకీ బాగుంది. సొంతంగా నాటుకోగా మిగిలిన నారు అమ్మడంతో అదనపు ఆదాయం సమకూరింది. ఈ ఏడాది ఎకరా పొలంలో నారుమడులు సాగు చేస్తున్నా. దీనికి రూ.లక్ష పెట్టుబడి అవుతుంది.

– నల్లపనేని పెంచలయ్య, కుడుములదిన్నెపాడు, కలిగిరి మండలం

అందుబాటులో ఉంది



పొగాకు నారు స్థానికంగానే అందుబాటులో లభిస్తోంది. గతంలో రాజమండ్రి, ఒంగోలు, కందుకూరు ప్రాంతాలకు నారు కోసం వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం బోర్డు అధికారుల సూచనలతో రైతులు స్థానికంగానే నాణ్యమైన నారును పెంచి ఇతర రైతులకు అందిస్తున్నారు.

– పూసాల అక్కపునాయుడు, రావులకొల్లు, కలిగిరి మండలం

నాణ్యమైన నారు ఎంపిక చేసుకోవాలి



పొగాకు బోర్డు సూచనలతో మంచి నారుమడులను సాగు చేయాలి. నాట్ల సమయంలో రైతులు నాణ్యమైన, ఎటువంటి తెగుళ్లు, చీడపీడలు ఆశించని మొక్కలను ఎంపిక చేసుకోవాలి.

– గంగపట్ల రాజశేఖర్, వేలం నిర్వహణాధికారి, డీసీపల్లి పొగాకు బోర్డు

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ఇందుకూరుపేట: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మైపాడు బీచ్‌లో ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు కిసాన్ నగర్‌కు చెందిన అన్నం మణికంఠ భార్య ప్రమీలమ్మ (34) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. భార్యాభర్తల మధ్య శుక్రవారం రాత్రి చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన ప్రమీలమ్మ శనివారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. అప్పటి నుంచి కుటుంబసభ్యులు ఆమె కోసం తీవ్రంగా గాలించినా ఆచూకీ తెలియరాలేదు. ఆదివారం తెల్లవారుజామున మైపాడు బీచ్‌లో మృహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలం చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతదేహాన్ని ప్రమీలమ్మదిగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చెరువులో మునిగిపోయి వ్యక్తి మృత్యువాత

నెల్లూరు(క్రైమ్): చెరువులో మునిగిపోయి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నెల్లూరు రూరల్ మండలం ఓగూరుపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఓగూరుపాడు గ్రామానికి చెందిన అరుణ, కృష్ణారెడ్డి (53) దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. కృష్ణారెడ్డికి గేదెలున్నాయి. పాల వ్యాపారం, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. రోజులాగే ఆదివారం గేదెలను గుంగుంట చెరువు ప్రాంతానికి తోలుకెళ్లాడు. కొన్ని నీటిలోకి దిగాయి. వాటిని బయటకు తోలేందుకు కృష్ణారెడ్డి చెరువులోకి దిగాడు. అయితే ఆయనకు ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. సమీపంలో గేదెలు మేపుతున్న శ్రీనయ్య, మహేంద్రలు ఈ విషయాన్ని గమనించి చెరువులో దిగి ఆయన్ను బయటకు తీశారు. అప్పటికే కృష్ణారెడ్డి మృతిచెంది ఉండడంతో జరిగిన విషయాన్ని బాధిత కుటుంబసభ్యులకు తెలియజేశారు. ఈ మేరకు మృతుడి కుమారుడు శివకుమార్‌రెడ్డి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేనున్నానంటూ..


అంత్యక్రియలు నిర్వహిస్తున్న పద్మావతి

సంగం: పెదనాన్నకు అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించింది ఓ ఆడబిడ్డ. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రమైన సంగంకు చెందిన కొరిమెర్ల వెంకటేశ్వరరావు (62) అవివాహితుడు. హైదరాబాద్‌లో కాంట్రాక్టర్‌గా ఉండేవాడు. శనివారం నెల్లూరుకు వచ్చాడు. అనారోగ్యానికి గురికావడంతో వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాస చౌదరి అందుబాటులో లేకపోవడంతో ఆయన కుమార్తె దంత వైద్యురాలైన కొరిమెర్ల పద్మావతి దగ్గరుండి పెదనాన్నకు అంత్యక్రియలు నిర్వహించింది.

ఎస్జీటీలకు పదోన్నతులు ఇవ్వాలి

కావలి: ఎస్జీటీలకు పదోన్నతులు ఇచ్చి జిల్లా పరిషత్ పాఠశాలలకు బదిలీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ఆదివారం టీచర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పడుతున్న కష్టాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించి హెల్త్‌కార్డులు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. యాప్స్ వల్ల టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత, మండల ప్రజా పరిషత్ పాఠశాలల్లో టీచర్ల కొరతను తీర్చాలన్నారు. తల్లికి వందనం పథకం ప్రభుత్వ బడుల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా గౌరవ అధ్యక్షుడు రవికుమార్, ఆర్థిక కార్యదర్శి మణికంద చారి, కావలి డివిజన్ కార్యదర్శి మాల్యాద్రి, జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, రాధయ్య, కార్యవర్గసభ్యులు సునీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఆటో మొబైల్ షాపు దగ్ధం

- రూ.20 లక్షల ఆస్తి నష్టం

కందుకూరు: పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆటో మొబైల్ షాపు ఆదివారం తెల్లవారుజామున దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు షాపు యజమాని షేక్ రఫీ ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానికుల కథనం మేరకు.. రఫీ కొన్ని సంవత్సరాలుగా షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ద్విచక్ర వాహనాలతోపాటు, ఇతర వాహనాల టైర్లు, ఆటో మొబైల్ సామగ్రి విక్రయిస్తుంటాడు. ఆదివారం తెల్లవారుజామున షాపులో నుంచి మంటలు వస్తున్నట్లు పోలీస్ సిబ్బంది గమనించి రఫీకి సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న బాధితుడు పరిశీలించగా అప్పటికే మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. అప్పటికే షాపులోని టైర్లు, సామగ్రి పూర్తిగా దగ్ధమైపోయాయి. ఇటీవల రూ.5 లక్షల విలువ చేసే కొత్త సరుకును షాపులోకి తెచ్చి ఉంచాడు. అయితే ప్రమాదానికి కారణం ఏంటనేది తనకు తెలియదని, పోలీసులు దర్యాప్తు చేసి వాస్తవాన్ని వెలుగులోకి తీసుకురావాలని బాధితుడు కోరాడు. కాగా ఇటీవల కాలంలో పట్టణంలో ఇటువంటి సంఘటన జరగడం ఇది రెండోసారి.


మంటల్లో పూర్తిగా దగ్ధమైన షాపు

నేరాలపై నిఘా

- పల్లెనిద్ర నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు
- 266 మంది దొంగల అరెస్ట్
- రూ.2.07 కోట్ల సొత్తు స్వాధీనం
- ఇసుక, గంజాయి అక్రమ రవాణాపై 236 కేసులు


స్వాధీనం చేసుకున్న సొత్తుతో ఎస్పీ, పోలీసులు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాలతో పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. నేరస్తుల కదలికలపై నిఘా పెంచారు. కార్డన్ సెర్చ్‌లు, వాహన తనిఖీలు విస్తృతం చేశారు. ఇసుక, గంజాయి అక్రమ రవాణాపై దాడులు ముమ్మరం చేశారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లను సందర్శిస్తూ నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేస్తున్నారు. పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

భారీగా సొత్తు

జిల్లాలో దొంగతనాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి పగలు, రాత్రి గస్తీని ముమ్మరం చేశారు. పాతనేరస్తులు, జైలు నుంచి విడుదలయ్యే వారి కదలికలపై నిఘా ఉంచారు. వారు ఏం చేస్తున్నారు? ఎక్కడ ఉంటున్నారు? తదితర వివరాలను సేకరించి నిఘా పెంచారు. సీసీఎస్, స్థానిక పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చోరీ కేసుల ఛేదనకు చర్యలు చేపట్టారు. గడిచిన రెండున్నర నెలల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 266 మంది దొంగలను అరెస్ట్ చేసి రూ.2,07,52,296ల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు దొంగతనాలు జరగకుండా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఊర్లకు వెళ్లేవారు విధిగా దీని సేవలను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు (ఫైల్)

1,756 టన్నుల ఇసుక సీజ్

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జిల్లాలో జోరుగా సాగుతోంది. అక్రమార్కులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. జూలై నుంచి ఇప్పటి వరకు 229 కేసులు నమోదు చేసి 401 మందిని అరెస్ట్ చేశారు. 337 వాహనాలను, 1,756 టన్నుల ఇసుకను సీజ్ చేశారు.

సైబర్ నేరాలపై 23 కేసులు

నకిలీ ఏసీబీ, సీబీఐ, ఈడీ, నార్కోటిక్స్ అధికారులు, డిజిటల్ అరెస్టులు, ఉద్యోగాలు, నకిలీ లోన్‌యాప్‌ల, హనీట్రాప్‌ల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. వీటిని కట్టడి చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930కు, సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్, సైబర్‌మిత్ర 9121211100లకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 23 కేసులు నమోదు కాగా 13 కేసులను పరిష్కరించారు.

జూదంపై..

క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ జూదాలు, పేకాట, సింగల్ నంబర్లాట తదితరాలపై చర్యలు చేపట్టారు. నిరంతర దాడులు చేస్తూ అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో బుకీలు ఎంతమంది ఉన్నారు? వారు ప్రస్తుతం ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు? తదితర వివరాలను సేకరిస్తున్నారు. కొందరు బుకీల వల్ల నష్టపోయామని పోలీసులకు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. దీంతో చర్యలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.

గంజాయి అక్రమ రవాణాపై..


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడు (ఫైల్)

గంజాయికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా విక్రయదారులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలు అవగాహన కల్పిస్తున్నారు. విద్యాసంస్థల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాపై ఏడు కేసులు నమోదు చేసి 26 మంది నిందితులను అరెస్ట్ చేశారు. 98.25 కేజీల గంజాయిని, కారు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

కార్డన్ సెర్చ్‌లు

వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఉపాధి నిమిత్తం జిల్లాకు వస్తున్నారు. నగర, పట్టణ శివార్లు అత్యంత వేగంగా విస్తరిస్తున్నాయి. నూతనంగా కాలనీలు వెలుస్తున్నాయి. వీటిలో అసాంఘిక శక్తులు తలదాచుకుని సమయం చూసి నేరాలకు పాల్పడే అవకాశం లేకపోలేదు. ఈ క్రమంలో నేరస్తులను ముందస్తుగానే కట్టడి చేసి నేరాలను నియంత్రించడంతోపాటు ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న వారి సమగ్ర వివరాలు సేకరించేందుకు కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు. చంద్రబాబునగర్, కావలి, కోవూరుల్లో కార్డన్ సెర్చ్‌లు చేపట్టారు. రికార్డుల్లేని 107 మోటార్‌బైక్‌లు, 9 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. 30 మందికి పైగా పాతనేరస్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరాలకు దూరంగా ఉండాలని లేని పక్షంలో పీడీ యాక్ట్‌లు తప్పవని హెచ్చరిస్తున్నారు.


కార్డన్ సెర్చ్‌లో భాగంగా కోవూరులో స్వాధీనం చేసుకున్న బైక్‌లతో.. (ఫైల్)